ఘనంగా శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు


అబిడ్స్: మంగళ్‌హాట్ పూసలబస్తీలో జన్మాష్టమి వేడుకల్లో ఆవుల కృష్ణారావు, ఆవుల అరుణ


గుడిమల్కాపూర్ జాంసింగ్ శ్రీకృష్ణ ఆలయంలో జన్మాష్టమి పూజలు


అబిడ్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకల్లో గోషామహాల్ ఏసీపీ సుదర్శన్‌ను సన్మానిస్తున్న దృశ్యం


గోల్కొండ రిసాల బజార్‌లో..


చిన్నికృష్ణుల వేషధారణలో జియాగూడ శ్లోకా ది స్కూల్ విద్యార్థులు



జియాగూడ విద్యాశ్రీ హైస్కూల్‌లో విద్యార్థులతో పాటు కరస్పాండెంట్ శ్యామ్ వెరా, ప్రిన్సిపల్ సునీత


షేక్‌పేట్‌లో చిన్నికృష్ణుడి వేషధారణలో.. యోధాన్ష్ రాయాన్




చార్మినార్: గోపిక వేషధారణలో చిన్నారి హితిక


చార్మినార్: రాధాకృష్ణుల వేషధారణలోని చిన్నారులతో గాంధీనగర్‌కు చెందిన చిన్నారి రిషిక్

అబిడ్స్: శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు అన్ని ప్రాంతాల్లో వైభవంగా నిర్వహించారు. మంగళ్‌హాట్ పూసలబస్తీలో ప్రముఖ ఆర్కిటెక్ ఇంజినీర్, వాస్తుశిల్పి ఆవుల కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ ఆవుల అరుణ ఆధ్వర్యంలో శనివారం తెల్లవారుజామున వేడుకలు ప్రారంభించారు. స్వామివారికి అభిషేకం, అర్చన, మధ్యాహ్నం హవనం నిర్వహించారు. శ్రీకృష్ణుడి భజనలు, భక్తిగీతాలతో ఆ ప్రాంతం మార్మోగింది. మంగళ్‌హాట్ పూసల బస్తీతో పాటు పలు ప్రాంతాల నుంచి వచ్చిన వందలాది మంది భక్తులకు అన్నప్రసాద వితరణ చేపట్టారు. ఆవుల కృష్ణారావు, ఆవుల అరుణ ఆధ్వర్యంలో రాత్రి వరకు వేడుకలు కొనసాగాయి.

గుడిమల్కాపూర్ జాంసింగ్ ఆలయంలో..

గుడిమల్కాపూర్ జాంసింగ్ శ్రీకృష్ణుడి ఆలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలు కన్నుల పండువగా చేపట్టారు. వేలాది మంది భక్తులు శ్రీకృష్ణుడిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వహకులు భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

శ్రీకృష్ణ జన్మాష్టమి ప్రత్యేక పూజలు

డబీర్‌పురా: కోమటివాడి రామాలయంలో శ్రీకృష్ణ జన్మాష్టమిని పురస్కరించుకొని శనివారం శ్రీకృష్ణ స్వామికి ఆలయ పూజారి బొంగులూరి రాంమూర్తి శాస్త్రి ఆధ్వర్యంలో పూజలు నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. పూజారులు బొంగులూరి శ్రీను పంతులు, బొంగులూరి విశ్వం, బొంగులూరి మిట్టుల ఆధ్వర్యంలో జరిగాయి.

చప్పన్ బోగ్ పూజలు

చార్మినార్: జన్మాష్టమి వేడుకల సందర్భంగా శనివారం చప్పన్ బోగ్ పూజలు ఘనంగా నిర్వహించారు. 56 రకాల వంటలతో పాటు తులసి ఆకులను నైవేద్యంగా శ్రీకృష్ణుడికి సమర్పించి పూజలు నిర్వహించారు.


శ్రీకృష్ణుడి వేషధారణలో శివాన్ష్ రెడ్డి




విజయనగర్‌కాలనీ: బలరామకృష్ణులు, గోపిక వేషధారణలో చిన్నారులు


లంగర్‌హౌస్ శ్రీత్రివేణి పాఠశాలలో..


శ్రీకృష్ణ స్వామికి పూజలు




గోల్కొండ: కృష్ణాష్టమి వేడుకల్లో బీజేపీ నాయకుడు బి.శ్రీకాంత్‌చారి


చార్మినార్: 56 రకాల వంటలతో చప్పన్ బోగ్ పూజల్లో భక్తులు

బీజేపీ భాగ్యనగర్ జిల్లా మీడియా కన్వీనర్‌గా రఘుకాంత్



గౌలిపురా: గౌలిపురా డివిజన్ దానయ్యనగర్ ప్రాంతానికి చెందిన జి.రఘుకాంత్ బీజేపీ భాగ్యనగర్ జిల్లా మీడియా కన్వీనర్‌గా నియమితులయ్యారు. బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధ్యక్షుడు జి.నిరంజన్ యాదవ్ రఘుకాంత్‌ను జిల్లా మీడియా కన్వీనర్‌గా శనివారం నియమించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బీజేపీలో పనిచేసే ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుందన్నారు. బీజేపీలో తన సేవలను గుర్తించి పార్టీ తనకు ఈ బాధ్యతలను అప్పగించడం సంతోషంగా ఉందన్నారు. బీజేపీ రాష్ట్ర నాయకులు నిరంజన్ యాదవ్, కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మీ, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్రకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

ఘనంగా రాణి అవంతిబాయి జయంతి



అఫ్జల్‌గంజ్: స్వాతంత్ర్య సమరయోధురాలు రాణి అవంతిబాయి జయంతిని ఘనంగా నిర్వహించారు. ధూల్‌పేట్ జుమ్మెరాత్ బజార్‌లో ఆమె విగ్రహానికి ఎమ్మెల్యే రాజాసింగ్, సత్యసుందరం ఫౌండేషన్ చైర్మన్ గోపాల్ సింగ్, పలువురు బీజేపీ నాయకులు సోమరాజ్‌సింగ్, నట్రాజ్‌నాందారి, కాంగ్రెస్ నాయకుడు క్రాంతితో పాటు సూరజ్‌సింగ్ నివాళులర్పించారు.

నియామకం


చంద్రమోహన్‌గౌడ్

గౌలిపురా: గౌలిపురా డివిజన్ హనుమాన్‌నగర్ ఫేజ్–3 కాలనీ నూతన కమిటీని ఎన్నుకున్నారు. హనుమాన్‌నగర్ ఫేజ్–3 కాలనీకి గడ్డమీది చంద్రమోహన్ గౌడ్‌ను ప్రధాన కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శ్రీనివాసన్, కోశాధికారిగా సాయిలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా జి.చంద్రమోహన్ గౌడ్ మాట్లాడుతూ.. హనుమాన్‌నగర్ ఫేజ్–3 కాలనీ అనేది ఒక ఉమ్మడి కుటుంబం వంటిదన్నారు. కాలనీలో ఏ సమస్య ఉన్నా సాధ్యమైనంత పరిష్కరించేందుకు ప్రయత్నం చేస్తానన్నారు. అందరి సహకారంతో గతంలో మాదిరిగా మరింత అభివృద్ధి చేయడానికి తనవంతు కృషి చేస్తానన్నారు.

ఐస్ స్కేటింగ్ టీమ్ కోచ్‌గా మహ్మద్ అబ్దుల్ ఖదీర్



గన్‌ఫౌండ్రీ: ఇండియన్ ఐస్ స్కేటింగ్ టీమ్ కోచ్‌గా నగరానికి చెందిన మహ్మద్ అబ్దుల్ ఖదీర్ నియమితులయారు. ఈ సందర్భంగా అబ్దుల్ ఖదీర్ శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ఈ నెల 20వ తేదీ నుంచి డెహ్రాడూన్‌లో జరగబోయే ఏషియన్ ఓపెన్ షాట్ ట్రాక్ స్పీడ్ స్కేటింగ్ ట్రోఫీలో పాల్గొనే జట్టుకు కోచ్‌గా వ్యవహరించనున్నట్లు తెలిపారు. ఈ ఛాంపియన్‌షిప్ పోటీలు యువ క్రీడాకారులకు చక్కటి వేదిక అని, వారిలో ఉన్న ప్రతిభను వెలికి తీసేందుకు దోహదపడతాయన్నారు. తెలంగాణ ఐస్ స్కేటింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు దీపక్‌కుమార్ ఆయనను ప్రత్యేకంగా అభినందించారు.

19న అంతర్జాతీయ యువజన దినోత్సవాల ముగింపు

చార్మినార్: తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 19న ఉదయం 10 గంటలకు అబిడ్స్ బొగ్గులకుంటలోని తెలంగాణ సారస్వత పరిషత్ ఆడిటోరియంలో అంతర్జాతీయ యువజనోత్సవ ముగింపు ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు డాక్టర్ రాజ్ నారాయణ ముదిరాజ్ ఒక పత్రికా ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా గ్లోబల్ ఐకాన్ యూత్ అవార్డు 2025, జాతీయ ఐక్యత అవార్డు 2025 కోసం వివిధ రంగాల్లో సేవలందిస్తున్న వారిని ఎంపిక చేశామన్నారు.

కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతి



గోల్కొండ: దివంగత కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. కార్వాన్ ముదిరాజ్ మహాసభ ఆధ్వర్యంలో బండారి వెంకటేష్‌ముదిరాజ్ సారథ్యంలో వేడుకలు జరిగాయి. గుడిమల్కాపూర్ జ్యోతిరావుపూలే విగ్రహం వద్ద కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బండారి వెంకటేష్ ముదిరాజ్ మాట్లాడుతూ కొర్వి కృష్ణస్వామి ముదిరాజ్ నిరక్షరాస్యత నిర్మూలనకు జీవితాన్ని అంకితం చేశారన్నారు. సమాజ సేవకుడిగానే కాకుండా రచయితగా, పాత్రికేయుడిగా ఆయన తనవంతు కృషి చేశారన్నారు. పేద, బడుగు వర్గాల జీవితాల్లో మార్పు కోసం విద్య ఒక్కటే మార్గం అన్నారన్నారు. పేదలకు విద్య కోసం తన జీవితాన్ని అంకితం చేశారన్నారు. కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలి


సమావేశంలో ఏసీపీ మునావర్

జియాగూడ: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంతంగా జరుపుకోవాలని కుల్సుంపురా డివిజన్ ఏసీపీ మునావర్ అన్నారు. ఈ మేరకు జియాగూడ ఎస్‌డీపీ గార్డెన్‌లో కుల్సుంపురా, టప్పాచబుత్ర, గుడిమల్కాపూర్ పోలీస్‌స్టేషన్ల మైత్రి గణేష్ మండప నిర్వాహకుల సమావేశాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండప నిర్వాహకులు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలన్నారు. నిఘా కెమెరాల మధ్య వేడుకలు జరుపుకోవాలని, అసాంఘిక శక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డీజేలను అనుమతి లేదన్నారు. కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్లు కె.సునీల్, అభిషేక్, రాజు, ఎస్ఐ.భాస్కర్‌రావు, మైత్రి కమిటీ సభ్యులు దర్పల్లి నర్సింహులు, పి.శంకర్‌రావు, జగదీష్ యాదవ్, శివకుమార్ యాదవ్, జె.లక్ష్మీనారాయణ, రాకేష్, కె.శివాజీ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చట్టంతో మాలలకు నష్టం


ఎంపీ మల్లు రవికి వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు బేరా బాలకిషన్ తదితరులు

సుల్తాన్‌బజార్: ఎస్సీ వర్గీకరణ చట్టంతో దళితుల్లోని 26 మాల అనుబంధ కులాలకు రోస్టర్ విధానం వల్ల అన్యాయం జరుగుతోందని రాష్ట్ర మాల సంఘాల జేఏసీ చైర్మన్ డాక్టర్ మందాల భాస్కర్, గ్రేటర్ హైదరాబాద్ మాల సంఘాల జేఏసీ చైర్మన్ బేర బాలకిషన్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు తెలంగాణ ఎంపీ ఫోరం కన్వీనర్ ఎంపీ డాక్టర్ మల్లురవిని మాల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శనివారం కలిసి సమస్యలను విన్నవించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎస్సీలోని గ్రూప్–3లో చేర్చిన 26 కులాల విద్యార్థులకు, నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు లేకుండా పోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఉద్యోగులకు పదోన్నతులు రాకుండా వెనుకబడిపోతున్నారని అన్నారు. మల్లురవి సానుకూలంగా స్పందించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్తామని హామీ ఇచ్చారన్నారు. కార్యక్రమంలో తెలంగాణ మాల సంఘాల జేఏసీ గౌరవ అధ్యక్షుడు చెరుకు రాంచందర్, గ్రేటర్ వైస్ చైర్మన్ డాక్టర్ వీరస్వామి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో ఎన్నో అనర్థాలు


టోలిచౌకీలో అవగాహన కల్పిస్తున్న పోలీసులు

గోల్కొండ: మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని టోలిచౌకీ ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్ అన్నారు. ఆయన ఆధ్వర్యంలో శనివారం టోలిచౌకీ చౌరస్తా వద్ద మాదకద్రవ్యాల వ్యతిరేకత కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా మాదకద్రవ్యాలతో జరిగే అనర్థాల గురించి సమగ్రంగా వివరించారు. టీనేజ్ యువకులు నేడు మత్తు పదార్థాలకు బానిసలుగా మారుతున్నారని, ఇది ఎంతో ఆందోళనకరమైన విషయం అన్నారు. మాదకద్రవ్యాలు ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయన్నారు. కుటుంబాలు పూర్తిగా విచ్ఛిన్నం అయ్యే ప్రమాదం ఉంటుందన్నారు. డ్రగ్స్‌కు బానిసలైన వారికి సమాజంలో గౌరవం ఉండదని అన్నారు. విద్యార్థులు డ్రగ్స్ బానిసలైతే జీవితం నాశనం అవుతుందని, కుటుంబాలు అస్తవ్యస్తంగా మారతాయన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి తెలంగాణ పోలీసులు నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో డీఐ బాలరాజ్ తదితరులున్నారు.

దేశభక్తిని చాటిన వందేభారత్ సినిమా



గన్‌ఫౌండ్రీ: ప్రతి ఒక్కరిలో జాతీయత భావాన్ని పెంపొందించాలని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ నాగమారుతి శర్మ అన్నారు. రవీంద్రభారతిలోని తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో పైడి జయరాజ్ థియేటర్‌లో వందే భారత్ సేవ్ ఇండియా సినిమాను శనివారం ప్రదర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సినిమా దేశభక్తిని పెంపొందించేలా ఉందన్నారు. దర్శక నిర్మాత మల్లం రమేష్, భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, సినీ నటులు లోహిత్, అనురాధ చౌదరి, జెన్ని, మాణిక్ బాలాజీ, కిశోదాస్, కేంద్ర బాల సాహిత్య అకాడమి పురస్కార గ్రహిత చొక్కాపు వెంకటరమణ పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సు కిందపడి మహిళకు తీవ్ర గాయాలు



సంతోష్‌నగర్: పుట్టిన రోజు వేడుకలకు హాజరై తిరిగి ఇంటికి చేరుకునే క్రమంలో ఆర్టీసీ బస్సు చక్రం కింద పడిన ఓ మహిళ తీవ్ర గాయాల పాలైన ఘటన శనివారం కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్రినాక ప్రాంతానికి చెందిన దీపక్ కుమార్ గుప్తా, భార్గవి(33)లు దంపతులు. భార్గవి బాలాపూర్‌లో పుట్టిన రోజు వేడుకల్లో పాల్గొని తిరిగి మిధాని డిపోనకు చెందిన ఆర్టీసీ బస్సు ఎక్కి మిధాని చౌరస్తాలో దిగుతున్న క్రమంలో ముందు టైరు కింద పడిపోవడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు కంచన్‌బాగ్ పోలీసులకు సమాచారం అందజేశారు. వెంటనే ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు భార్గవిని చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. భర్త దీపక్ కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

జన్మదిన వేడుకల్లో కత్తితో దాడి


దాడిలో గాయపడిన సయ్యద్ అబ్దుల్ రహీం

డబీర్‌పురా: బర్త్ డే వేడుకలను జరుపుకుంటుండగా ఓ యువకుడితో మరో యువకుడు గొడవ పడి కత్తితో దాడి చేసిన ఘటన రెయిన్‌బజార్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం .. డబీర్‌పురా దర్వాజా ప్రాంతానికి చెందిన సయ్యద్ అబ్దుల్ రహీం క్విజర్ అలియాస్ క్విజర్(26) ఈ నెల 15వ తేదీన రాత్రి తన స్నేహితుడు ఆఫాన్ జన్మదిన వేడుకలను జరుపుకునేందుకు డబీర్‌పురా ఫర్హత్‌నగర్‌లోని డీలక్స్ మెడికల్ షాపు వద్దకు వెళ్లాడు. అక్కడ అబ్దుల్ రహీం తన స్నేహితుడు ఆఫాన్‌తో జన్మదిన వేడుకలు జరుపుకుంటుండగా అక్కడికి చేరుకున్న మహ్మద్ ముస్తాఫా హుస్సేన్ గొడవ పడ్డాడు. అనంతరం అబ్దుల్ రహీంపై మహ్మద్ ముస్తాఫా కత్తితో దాడి చేసి తీవ్రంగా గాయపరిచాడు. పోలీసులు అబ్దుల్ రహీంను ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అబ్దుల్ రహీం సోదరుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

గణేష్ మండప నిర్వాహకులు నిబంధనలు పాటించాలి


గణేష్ మండపాల నిర్వాహకుల సమావేశంలో మాట్లాడుతున్న ఏసీపీ సుదర్శన్, ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు

అబిడ్స్: గణేష్ మండప నిర్వాహకులు పోలీసు నిబంధనలు తప్పకుండా పాటించాలని, గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేలా అందరూ సహకరించాలని ఏసీపీ సుదర్శన్ అన్నారు. గోషామహాల్ పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎం.శ్రీనివాసులు ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గణేష్ మండపాల నిర్వాహకుల సమావేశంలో ఏసీపీ సుదర్శన్ మాట్లాడుతూ ప్రతి గణేష్ మండపం వద్ద గణేష్ మండప నిర్వాహకులు ఎప్పుడూ అందుబాటులో ఉండాలని, అనుమానాస్పద వస్తువులు కానీ వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీస్ కంట్రోల్ రూమ్ లేదా సమీపంలోని పోలీస్‌స్టేషన్‌కు వెంటనే సమాచారం అందజేయాలన్నారు. ప్రతి మండపంలో భద్రత ప్రమాణాలు పాటించాలని ఆయన పేర్కొన్నారు. ఫైర్ సేఫ్టీ పరికరాలను, కాటన్ పేపర్‌తో డెకరేషన్ చేయాలన్నారు. ప్రతి గణేష్ మండపం వద్ద నిర్వాహకులే సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలన్నారు. గోషామహాల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసులు మాట్లాడుతూ.. మండపం వద్ద రాజకీయ ప్రసంగాలు, ఇతర మతాల ప్రసంగాలు చేయవద్దన్నారు. ప్రజలను భయపెట్టి గణేష్ చందాలను వసూలు చేస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. అన్ని మండపాల నిర్వాహకులు పోలీసులు నిబంధనలను పాటించి, గణేష్ నవరాత్రి ఉత్సవాలు ప్రశాంతంగా కొనసాగే విధంగా సహకరించాలని కోరారు. సమావేశంలో గోషామహాల్ క్రైమ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్‌రెడ్డి, ఎస్ఐలు లక్ష్మయ్య, అరుణోదయ, రవి, ఇతర మండపాల నిర్వహకులు పాల్గొన్నారు.

ఘనంగా క్రాంతివీర్ సంగోళి రాయన్న కురుమ జయంతి


సంగోళి రాయన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దర్పల్లి నర్సింహులు తదితరులు

జియాగూడ: ధైర్య సాహసాలు, దేశభక్తి ప్రతీక అయిన క్రాంతివీర్ సంగోళి రాయన్న పోరాటం నేటి ప్రజలకు స్ఫూర్తి అని కురుమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దర్పల్లి నర్సింహులు అన్నారు. ఈ మేరకు జియాగూడ బసవ మండప్‌లో క్రాంతివీర్ సంగోళి రాయన్న 79 జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి ఆర్గనైజేషన్ అధ్యక్షుడు కె.శివాజీ ఆధ్వర్యంలో శనివారం నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. బ్రిటీష్ పాలనకు వ్యతిరేకంగా పోరాడిన సంగోళి రాయన్న క్రాంతివీర్‌గా ఖ్యాతిచెందారన్నారు. కార్యక్రమంలో కురుమ సంఘం ప్రధాన కార్యదర్శి కె.జగన్నాథప్ప, ఎస్ఐ రాజేశ్వర్, బసవ మండప్ పీఠాధిపతి అమిషానంద స్వామి, లింగాయత్ మహాసభ అధ్యక్షుడు విజయ్‌కుమార్ పెట్నే, ప్రధాన కార్యదర్శి అనిల్ పాటీల్, కె.మారుతి, భాగ్యవాన్ జవాలే, నాగరాజ్ కాల్సే తదితరులు పాల్గొన్నారు.

300 మంది పోలీసులతో బందోబస్తు


బందోబస్తును పర్యవేక్షించిన ఏసీపీ ప్రవీణ్‌కుమార్, ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్

అబిడ్స్: అబిడ్స్ పరిసర ప్రాంతాలు జనసంద్రంగా మారాయి. శ్రీకృష్ణ జన్మాష్టమి వేడుకలతో అబిడ్స్ ఇస్కాన్ ఆలయానికి శనివారం లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. ముందు జాగ్రత్తగా అబిడ్స్ ఏసీపీ ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో ఇన్‌స్పెక్టర్ ఇమాన్యుయేల్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ నర్సింలు దాదాపు 300 మంది అదనపు పోలీసులతో బందోబస్తు చేపట్టారు. అబిడ్స్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రవికుమార్ ఆధ్వర్యంలో అదనపు ట్రాఫిక్ పోలీసులు ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. శనివారం రాత్రి వరకు అబిడ్స్ పరిసర ప్రాంతాల రోడ్లపై వాహనాల రాకపోకలు నిలిపివేయడంతో ఇస్కాన్ ఆలయానికి వచ్చే భక్తులు కాలినడకన ఆలయానికి వచ్చారు. సీసీ కెమెరాల ద్వారా పోలీసు సిబ్బంది బందోబస్తు పర్యవేక్షించారు.